









మోగిన 'స్థానిక' ఎన్నికల నగారా

- షెడ్యూల్ విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం

ఆసిఫాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. ఈ మేరకు సోమ వారం రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు రెండు దశల్లో, గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు దశల్లో నిర్వహించనున్నారు. జిల్లాలో 335 గ్రామపంచాయతీలు, 127 ఎంపీటీసీ స్థానా లు, 15 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. ఇదివరకే అధికారులు అయా స్థానాల్లో రిజర్వేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు అక్టోబరు 23న తొలి విడత, 27న రెండో విడత ఎన్నికల పోలింగ్ నిర్వహించనుంది. అలాగే గ్రామ పంచాయతీలకు అక్టోబరు 31న తొలి విడత, నవంబరు 4న రెండో విడత, నవంబరు 8న మూడో విడత ఎన్నికలను నిర్వహించను న్నట్లు వెల్లడించింది. పోలింగ్ పూర్తయిన తర్వాత అదే రోజు గ్రామ పంచాయతీల ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. నవంబరు 11న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్ల లెక్కింపు జరుగుతుందని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. తొలి విడత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ అక్టోబరు 9 నుంచి 11 వరకు ఉంటుంది. రెండో విడత నామినేషన్ల స్వీకరణ అక్టోబరు 13 నుంచి 15 వరకు ఉంటుంది. అలాగే గ్రామపంచాయతీ ఎన్నికల తొలి విడత నామినేషన్ల స్వీకరణ అక్టోబరు 17నుంచి 19 వరకు, రెండో విడత నామినేషన్ల స్వీకరణ అక్టోబరు 21 నుంచి 23 వరకు, మూడో విడత అక్టోబరు 25 నుంచి 27 వరకు కొనసాగుతుంది.

కేటగిరి	సర్పంచ్	వార్డు	ఎంపీటీసీ
ఎస్టీ	198	1292	39
ఎస్సీ	32	226	18
బీసీ	67	534	41
జనరల్	38	822	29
మొత్తం	335	2,874	127

- సర్పంచ్, ఎంపీటీసీల వారీగా రిజర్వేషన్లు:

జిల్లాలో 335 గ్రామపంచాయతీలు ఉండగా వాటి పరిధిలో 2,874 వార్డులు ఉన్నాయి. 15 మండలాల పరిధిలో 127 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. అధికారులు జనాభా ప్రకారం రిజర్వేషన్లను ఖరారు చేశారు.



రైతులకు నాణ్యమైన ఎరువులు అమ్మాలి

దహెగాం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన ఎరువులను అమ్మాలని ఏవో రామకృష్ణ అన్నారు. దహెగాం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను సోమవారం తనిఖీ చేశారు. అనంతరం పీఏసీఎస్ వద్ద యూరియా పంపిణీని పరిశీలించారు. ఆయన వెంట ఏఈవోలు ఉన్నారు.

అంబరాన్నంటిన సంబరాలు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సద్దుల బతుకమ్మ వేడుకలు సోమవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. రామ రామ ఉయ్యాలో.. రామనే శ్రీరామ ఉయ్యాలో.. హరిహరి ఓ దేవ ఉయ్యాలో.. హరియో బ్రహ్మదేవ ఉయ్యాలో.. అంటూ మహిళలు బతుకమ్మ పాటలతో హోరెత్తించారు. ఆలయ ప్రాంగణాల్లో, వీధులు, కూడళ్ల వద్ద మహిళలు బతుకమ్మ ఆటల సందడి కనువిందు చేసింది. చిన్నా పెద్ద తేడా లేకుండా మహిళలు సంప్రదాయ వస్త్రాలంకరణలతో లయబద్ధంగా ఆడుతూ.. పాడుతూ.. సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. మహిళలు పోటీపడి విభిన్న రూపాల్లో బతుకమ్మలను పేర్చి అందంగా తీర్చిదిద్దారు. నూతన వస్త్రాలు, నగలు ధరించి ఒక్క చోట చేరి బతుకమ్మ చుట్టు తిరుగుతూ పాటలు పాడుతూ ఆడడంతో పాటు యువతులు, మహిళలు కోలాటం ఆడారు. పట్టణంలోని రావులవాడ, కన్య కాపరమేశ్వరి ఆలయం, పొట్టి శ్రీరాములు చౌక్, కంచుకోట, తారక రామానగర్, రాజంపేట, సాయినగర్, పైకాజీనగర్, బజార్‌వాడీ, హడ్కో కాలనీ, సందీప్‌నగర్, జన్కాపూర్, దస్నాపూర్‌లో కాలనీల్లో మహిళలు ఆడి పాడారు. కాగజ్‌నగర్ పట్టణంతో పాటు జిల్లాలోని సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూరు, దహెగాం, పెంచికలపేట, రెబ్బెన, వాంకిడి, కెరమెరి, జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్, తిర్యాణి మండలాల్లో మహిళలు ఆనందోత్సాహాల మధ్య సద్దుల బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు.


ఆసిఫాబాద్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


కాగజ్‌నగర్‌లో...

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణంలో సోమవారం సద్దుల బతుకమ్మ పండుగను మహిళలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. రంగు రంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను ఆయా వార్డుల్లో ఏర్పాటు చేసి గౌరమ్మను ఆరాధించారు. బతుకమ్మ చుట్టూ ఆటలు ఆడి, జానపద గీతాలతో సాంస్కృతిక సొగసును ప్రతిబింబిస్తూ కాగజ్‌నగర్‌లో సద్దుల బతుకమ్మ ఉత్సవం ఘనంగా సాగింది.

- బతుకమ్మ పండుగ తెలంగాణ రాష్ట్రానికి ప్రతీక అని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. సోమవారం ఎస్పీఎం క్రీడా మైదానంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు.


జిల్లా పోలీసు కార్యాలయంలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

పువ్వులను పూజించడం తెలంగాణ ప్రజల గొప్ప సంస్కృతి
- ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్: పూలను పూజించడం తెలంగాణ ప్రజల గొప్ప సంస్కృతి అని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబరాల్లో కుటంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు బతుకమ్మ, విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీఐలు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు, మహిళా ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

చింతలమానేపల్లి/పెంచికలపేట/ కెరమెరి/ సిర్పూర్(టి): చింతలమానేపల్లి, పెంచికలపేట, కెరమెరి, సిర్పూర్(టి) మండలాల్లో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.




ఆసిఫాబాద్‌లో బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మహిళలు


కాగజ్‌నగర్‌లో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే హరీష్‌బాబు





ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెండో సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణలో భాగంగా రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు అందించిన శిక్షణ కార్యక్రమానికి కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండో సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమైనదని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పార దర్శకంగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

ముమ్మర తనిఖీలు చేపట్టాలి: ఎస్పీ

స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో చెక్ పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన నెలవారీ సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ ఉన్నందున 24 గంటలు అప్రమత్తతతో విధులను నిర్వహించాలని సూచించారు. ఎన్నికల్లో ప్రలజను ప్రభావితం చేయడానికి డబ్బు, మద్యం ఇతరసామగ్రి జిల్లాలోకి ప్రవేశించకుండా చెక్ పోస్టుల ద్వారా వివిధ శాఖల సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించడంలో కృషిచేయాలని పేర్కొన్నారు. ఏఎస్పీ చిత్త రంజన్, డీఎస్పీ వాహిదుద్దీన్, విష్ణుమూర్తి, సీఐ రాణాప్రతాప్, శ్రీధర్, పాల్గొన్నారు.

మద్యం దుకాణానికి టెండరు దాఖలు

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల టెడర్ల దాఖల్లో భాగంగా సోమవారం ఆసిఫాబాద్ షాప్ నంబర్-1కి ఒక టెండర్ దాఖలైనట్లు సీఐ రమేష్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 నుంచి ప్రారంభమైన టెండర్ ప్రక్రియ అక్టోబరు 18 వరకు కొనసాగుతుందన్నారు. 23న లక్కీ డ్రా పద్ధతిలో మద్యం షాపులను కేటాయించనున్నట్లు ఆయన తెలిపారు.

డిప్యూటీ కలెక్టర్‌గా జాసిన్త్ జోల్



కలెక్టర్‌కు పూలమొక్కను అందిస్తున్న డిప్యూటీ కలెక్టర్ జాసిన్త్ జోల్

ఆసిఫాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ కలెక్టర్‌గా జాసిన్త్ జోల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలో కలెక్టర్ వెంకటేష్ దోత్రేను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.











వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణం చేయడమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రచార ప్రముఖ్ పురుషోత్తం అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల స్థాపన ఉత్సవాల్లో భాగంగా ఆర్‌ఎస్‌ఎస్ జనగాం ఖండ ఆధ్వర్యంలో స్థానిక సత్యసాయిబాబా దేవాలయంలో విజయదశమి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1925లో ప్రారంభమై నేడు దేశవ్యాప్తంగా విస్తృత శాఖలతో, విభిన్న రంగాల్లో దేశభక్తి పూరిత, హిందుత్వ ఆధారసంస్థలతో ప్రపంచంలోనే అనేక దేశాల్లో పనిచేస్తోందని చెప్పారు. హిందువుల్లో ఐక్యతను సంఘం పెంపొందిస్తోందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

కెరమెరి(ఆంధ్రజ్యోతి): హిందువుల సంఘటననే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని కెరమెరి పటేల్ సోనేరావు, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రచారక్ నాగరాజు అన్నారు. కెరమెరి మండలం శివాలయంలో విజయదశమి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి సభ్యులు రామకృష్ణ, ధన్‌రాజు, శ్రీనివాస్, కోటేశ్వర్‌రావు, శ్రీనివాస్, మహేశ్వర్‌రెడ్డి, ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్ అనుమానాస్పద మృతి

నస్పూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోదావరి కాలనీలో నివాసం ఉంటున్న పూదరి సతీష్ (40) అనే ఆటో డ్రైవర్ సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్సై ఉపేందర్‌రావు చెప్పిన వివరాల ప్రకారం... ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న సతీష్ భార్యకు విడాకులు ఇచ్చి ఒక్కడే ఉంటున్నాడు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో మృతుడి అక్క పోగుల స్వప్న సతీష్ ఉంటున్న క్వార్టర్‌కు వచ్చి చూసేసరికి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. శరీరంపై చిన్న గాయాలున్నాయి. దీంతో వెంటనే మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సతీష్‌కు ఇంటి పక్కన ఉన్న బంగారయ్యకు పార్కింగ్ విషయంలో ఘర్షణలు జరుగుతున్నయి. ఆదివారం కూడా ఇదే విషయంలో గొడవ జరిగి సతీష్‌తో బంగారి, అతడి కుటుంబసభ్యులు కలిసి పార్కింగ్ విషయంలో గొడవ పడి ఇంట్లోకి వెళ్లి కొట్టినట్లు ఎస్సై తెలిపారు. దీంతో అనుమానాస్పద మరణంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు.

స్లైడ్ గేటు మీద పడి ఏఎస్ఐ మృతి


అర్జునసారధి(ఫైల్)

జైపూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జైపూర్ ఎస్టీపీపీలో సీఐఎస్ఎఫ్ ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న నరహరి శెట్టి అర్జునసారధి(56) స్లైడ్ గేట్ మీద పడి మృతిచెందినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అర్జునసారధి ఎస్టీపీపీ అడ్మిన్ బిల్డింగ్ మెయిన్ గేట్ వద్ద ఆదివారం సెక్యూరిటీ విధుల్లో ఉన్నాడు. ఈ క్రమంలో గేటు మూస్తుండగా ఒక్కసారిగా స్లైడ్ గేటు అతడిపై పడడంతో తోటి సిబ్బంది గేట్‌ను పక్కకు జరిపి అతన్ని గోదావరిఖని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. అర్జునసారధి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా కొచ్చెర్ల గ్రామానికి చెందినవాడని తెలిపారు. కుటుంబీకుల పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

డైలీ వేజ్ కార్మికుల రాస్తారోకో

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హాస్టల్ డైలీవేజ్ వర్కర్లు చేపడుతున్న సమ్మె 18వ రోజుకు చేరుకుంది. సోమవారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో బైఠాయించి నిరసన తెలిపారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణమాచారి, కార్మికులు ప్రభాకర్, వసంత్‌రావు, రాంబాబు, కోటయ్య, సదాశివ్, లక్ష్మి, లక్ష్మణ్, భరత్, రమేష్, సంతోష్, శశికళ, ప్రమీల, ఇందు, రామదాసు, గంగుబాయి, జంగుదేవి, సీతారాం, లత, తార, గంగుబాయి, తిరుపతి, రుక్మాబాయి, దివ్య, లక్ష్మి, మాన్కు, రాధాబాయి పాల్గొన్నారు.

లక్షలు వెచ్చించి.. నిర్లక్ష్యంగా వదిలి

నిరుపయోగంగా పీఏసీఎస్ గోదాం


నిరుపయోగంగా ఉన్న పీఏసీఎస్ గోదాం

వాంకిడి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండల కేంద్రంలో నిర్మించిన ప్రాథమిక సహకార సంఘం సముదాయం నిరుపయోగంగా తయారైంది. ప్రాథమిక సహకార సంఘం ద్వారా రైతులకు పంపిణీ చేసేందుకు తీసుకువచ్చిన యూరియాను నిల్వ ఉంచేందుకు 29 లక్షల రూపాయలతో పీఏసీఎస్ సమీపంలో గోదాం నిర్మించారు. నిర్మాణం పూర్తయి ఏడాది గడుస్తున్నా గోదాంను ఉపయోగంలోకి తీసుకురావడంలేదు. దీంతో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన గోదాం నిరుపయో గంగా తయారైంది. నాలుగు వరుసల జాతీయ రహ దారి పక్కన నిర్మించిన సర్వీస్ రోడ్డు నుంచి పీఏసీ ఎస్ గోదాంనకు వచ్చే రోడ్డు మూలమలుపు వెడల్పు తక్కువగా ఉండడంతో యూరియా లోడ్ లారీలు తిర గడం లేదు. దీంతో మండలానికి వచ్చే యూరియాను మండలంలోని బెండార రైతు వేదికలో నిల్వ ఉంచుతున్నారు. దీంతో వాంకిడి, సోనాపూర్, గోయే గాం, చిచ్‌పల్లి, సవ్వాతి, ధాబా తదితర పంచాయతీల రైతులు మండల కేంద్రాన్ని దాటి మరో ఎనిమిది కిలోమీటర్ల దూరంలో గల బెండార రైతువేదిక నుంచి యూరియాను తీసుకురావాల్సి వస్తోంది. మండల కేంద్రంలో యూరియా నిల్వ ఉంచకపోవడంతో యూరి యా కోసం వ్యయప్రయాసాలకోర్చి ఆటోలకు అధిక డబ్బులు పెట్టి యూరియ తీసుకురావాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన గోదాంపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. గోదాం వరకు యూరియా లోడ్ లారీలు వచ్చే విధంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. లక్షల రూపాయలతో నిర్మించిన గోదాంను ఉపయోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

అద్దె భవనంలో పీఏసీఎస్..

గోదాంను నిరుపయోగంగా ఉంచకుండా ప్రాథమిక సహకార బ్యాంకును ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం పీఏసీఎస్ బ్యాంకు అద్దే భవనంలో కొనసాగుతోంది. ఈ బ్యాంకును ఇక్కడకు మార్చితే గోదాం ఉపయోగంలోకి రావడమేకాకుండా అద్దె డబ్బులతో పాటు గోదాం పక్కన ఉన్న గదులతో ఆదాయం సమకూరుతుందని రైతులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు గోదాంను ఉపయోగంలోకి తీసుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



సింగరేణి సమాచారం

3న సెలవు దినంగా ప్రకటించాలి


కాసిపేట గని మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కాసిపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దసరా పండగను అక్టోబరు 3న సెలవు దినంగా ప్రకటించాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకులు కాసిపేట గని మనేజర్ సతీష్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఏఐటీయూసీ కేంద్ర కమిటీ కార్యదర్శి అక్బర్ అలీ మాట్లాడుతూ దసరా పండగ అక్టోబరు 2న వచ్చిందని, అదే రోజు మహాత్మాగాంధీ జయంతి ఉండడంతో గని కార్మికులు మైసమ్మమొక్కులు చెల్లించుకోలేకపోతారని, దీంతో గని కార్మికుల మనోభావాలు, భక్తిని దృష్టిలో ఉంచుకుని సింగరేణి యాజమాన్యం ఆలోచించి దసరా సెలవును అక్టోబరు 3న ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, నాయకులు నాగేశ్వర్‌రావు, మీనుగు లక్ష్మీనారాయణ, రాజేందర్ , సురేష్, రంజిత్, అశోక్, గణేష్ పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: దసరా సెలవును మార్చాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు అన్ని గనులు, డిపార్టుమెంట్ల వద్ద సోమవారం ఆందోళనలు చేపట్టారు. కేకే 5 గనిపై నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ మాట్లాడారు. అనంతరం గనుల అధికారులకు వినతిపత్రాలు అందించారు.

శ్రీరాంపూర్: దసరా పండుగ అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజున వస్తున్నందున ఆ పీహెచ్‌డీని కార్మికులకు 3వ తేదీన ఇవ్వాలని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా అన్నారు. సెలవు మార్పు కోరుతూ శ్రీరాంపూర్‌లోని అన్ని గనులు, విభాగాలపై ఏటీయూసీ ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, జీఎం చర్చల ప్రతినిధులు రాచర్ల చంద్రమోహన్, ప్రసాద్ రెడ్డి, సంపత్, బద్రి బుచ్చయ్య, పిట్ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: గాంధీ జయంతిన దసరా వచ్చినందుకు సెలవు దినాన్ని అక్టోబర్ 3కు మార్చాలని ఏఐటీయుసీ బెల్లంపల్లి, గోలేటి బ్రాంచి ఇంచార్జీ చిప్ప నర్సయ్య అన్నారు. సోమవారం శాంతిఖనిగని ఆవరణలో గని పిట్ కార్యదర్శి దాసరి తిరుపతిగౌడ్ అధ్యక్షతన గేట్ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, రాజేందర్, రాజేశ్, సంతోష్‌లు పాల్గొన్నారు.

రెబ్బెన: గాంధీ జయంతి, దసరా పండగ ఒకే రోజు రావడంతో కార్మికులు, ఉద్యోగులు గనులపై పండగ జరుపుకోలేక పోతున్నందున తేదీని మార్చాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు ఖైరిగూడ మేనేజర్ శంకర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు శ్రీనివాస్, మొగిలి, ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: గాంధీ జయంతి, దసరా 2వ తేదీన వచ్చినందున దసరా సెలవును మరొక రోజు ఇవ్వాలని బీఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి ఒకప్రకటనలో సింగరేణి యాజమాన్యాన్ని కోరారు.

ఉత్పత్తిలో కార్మిక సంఘాలది కీలకపాత్ర

మందమర్రిటౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఉత్పత్తిఉత్పాదకతకు సంబంధించి కార్మిక సంఘాల ది కీలకపాత్ర అని మందమర్రి జీఎం రాధాక్రిష్ణ తెలిపారు. సోమవారం గుర్తింపు సంఘంతో నిర్వహించిన 10వ స్ట్రక్చరల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి ఉద్యోగులకు సంబంధించిన సమస్యలను వెనువెంటనే పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం విజయప్రసాద్, మందమర్రి బ్రాంచి సెక్రెటరీ సలేంద్ర సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్, ఏఐటీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ వెంకటస్వామి, రామకష్ణాపూర్ బ్రాంచి సెక్రటరీ అక్బర్ అలీ, బెల్లంపల్లి బ్రాంచి సెక్రెటరీ దాగాం మల్లేశ్ పాల్గొన్నారు.

గుండెపోటుపై అవగాహన కలిగి ఉండాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేసే ప్రతి ఉద్యోగి గుండెపోటుపై అవగాహన కలిగి ఉండాలని ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. డిప్యూటీ సీఎంవో డాక్టర్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఆర్‌కే 8 డిస్పెన్సరీలో ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా కరపత్రాలు ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా జీఎం హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లోక్‌నాథ్ రెడ్డి, డాక్టర్ సాయి నిఖిత, డాక్టర్ పంకీ, పిట్ కార్యదర్శి విజయలక్ష్మీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కౌటాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తాచాటాలని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన తరువాత మొదటిసారిగా సోమవారం మండల కేంద్రానికి రావడంతో బీఆర్ఎస్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కోనప్ప నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అందరు కలిసికట్టుగా పనిచేయాలని పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా బెజ్జూరు మండలానికి చెందిన 30 మంది కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. సమావేశంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మాంతయ్య, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, వసంత్‌రావు, బాపు, బ్రహ్మయ్య, వసంత్, ప్రకాష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భీం వర్ధంతి ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలం జోడేఘాట్‌లో అక్టోబరు 7న నిర్వహించనున్న కుమరంభీం వర్ధంతి సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్యే కోవలక్ష్మి, భీం మనుమడు సోనేరావుతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 85వ భీం వర్ధంతిని విజయవంతం చేయాల ని కోరారు. కార్యక్రమంలో నాయకులు కమల, చంద్రశేఖర్, మోతిరాం, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ సర్‌సిల్క్ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు సోమవారం పూజలు చేశారు. ఈ సందర్భంగా దుర్గాదేవి విగ్రహం వద్ద వేద పండితులు ఎమ్మెల్యేతో జలాభిషేకం, కుంకుమ పూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

అనంతరం అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్, కుమరంభీం కలెక్టర్ వెంకటేష్ దోత్రె, అధికారులు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు. సోమవారం హైద్రాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అదనపు కలెక్టర్, ఎన్నికల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రకటన వచ్చినందున నిర్వహణకు కావాల్సిన ఏర్పాట్లు, బందోబస్తు, అధికారులు, సిబ్బంది నియామకం, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, రక్షణ ఏర్పాట్లు, ఇతర అంశాలకు సంబంధించి ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే ప్రచార అంశాలను వెంటనే తొలగించాలన్నారు. మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియామావళిని పకడ్బందీగా నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తామన్నారు. మొత్తం జిల్లాలోని 306 గ్రామపంచాయతీల్లో 2,680 వార్డులు, 306 గ్రామాలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం ఎన్నికలు సజావుగా సాగేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, అదనపు కలెక్టర్ చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌ఆర్డీవో శ్రీనివఆసరావు, జడ్పీ సీఈవో గణపతి, డీపీవో వెంకటేశ్వర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సంఘం నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి వీసీ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్‌లు, సబ్ కలెక్టర్‌లు, మండల అధికారులు, పోలీసు అధికారులు ఎన్నికల అధికారులతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు కావాల్సిన ఏర్పాట్లు బందోబస్తు, సిబ్బంది నియామకం, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, రక్షణ ఏర్పాటు, ఇతర ఎన్నికల అంశాలకు సంబంధించి అధికారుల ఎన్నికల సంఘం నిబంధనలను ఖచ్చితగా పటించాలని తెలిపారు. మీడియాలో వచ్చే ప్రకటనలు, సోషల్ మీడియాలో ప్రచారంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు రెండు విడతలు, సర్పంచ్ ఎన్నికలు మూడు విడతల్లో జరుగుతాయన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ, ఓటర్ల జాబితా ప్రదర్శన, నామినేషన్ దాఖలు, పరిశీలన, చెల్లుబాటయ్యే నామినెటెడ్ అభ్యర్థుల జాబితా అప్పీల్‌లు, అప్పీళ్ల పరిష్కరణ, అభ్యర్థిత్వం ఉపసంహరణ, పోటీ చేయు అభ్యర్థుల జాబితా ప్రచురణ, పోలింగ్ నిర్వహణ, ఓట్ల లెక్కింపును ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి నిర్వహించాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సజావుగా చేపట్టాలని సూచించారు.

యూరియా కోసం బారులు


యూరియా కోసం బారులు తీరిన రైతులు

బెజ్జూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎదుట రైతులు యూరియా కోసం బారులు తీరారు. సోమవారం సొసైటీ 980 బస్తాలు రావడంతో వివిధ గ్రామాల నుంచి రైతులు పెద్ద ఎత్తున క్యూలైన్లలో నిలుచున్నారు. వ్యవసాయాధికారి నాగరాజు ఆధ్వర్యంలోరైతులకు రెండేసి బస్తాల చొప్పున పంపిణీ చేశారు. రైతులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

గజవాహనంపై దేవుడి ఊరేగింపు

సిర్పూర్(టి), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండల కేంద్రంలోని బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నవరాత్రులను పురస్కరించుకుని నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారిని సోమవారం రాత్రి గజవాహనంపై ఊరేగింపు నిర్వహించారు. ఆలయంలో ఈవో వేణుగోపాల్ ప్రత్యేకపూజలు నిర్వహించారు. అర్చకులు గంగు సత్యనారాయణ, ఆలయ కమిటీ చైర్మన్ కారం హనుమంతు, హిందూ ఉత్సవకమిటీ అధ్యక్షుడు తిరుపతి, ప్రశాంత్, శ్రీకాంత్, కరుణాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ ఐఎంఏ కార్యవర్గం

కాగజ్‌నగర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యవర్గం సోమవారం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, సెక్రెటరిగా డాక్టర్ శ్రావణ్‌కుమార్, ట్రెజరర్‌గా డాక్టర్ రమాకాంత్‌రావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఐఎంఏ సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ సభ్యులు పాల్గొన్నారు.


ఐఎంఏ కార్యవర్గ సభ్యులు

బెండార, కొమ్ముగూడ సంఘటనలపై అధికారులు స్పందించాలి

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలం బెండార గ్రామంలో పని చేస్తున్న అంగన్‌వాడీ టీచర్‌పై జరిగిన కుల వివక్షతపై, అదే విధంగా ఆసిఫాబాద్ మండలం కొమ్ముగూడ గ్రామంలో జరిగిన కుల బహిష్కరణపై అధికారులు వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ అండ్ విజిలెన్స్ కమిటీ సభ్యులు కేశవరావు కోరారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, గోపాల్, శ్యాంరావు, డోండుజీ, విజయ్, నాగసేన్, పాల్గొన్నారు.

డాక్టర్లు ఉండరు.. వైద్యం అందదు

మామూలు కేసులైనా ఇతర ప్రాంతాలకు రెఫర్ ..

జైనూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీవర్షాలకు జ్వరాలు ప్రబలుతున్నాయి. ఈక్రమంలో రోగులు వైద్యం కోసం జైనూరు పీహెచ్‌సీకి రాకపోకలు చేస్తున్నారు. సిర్పూర్(యు) మండలంలోని ఘుమనూర్‌కు చెందిన ఓ ఎమర్జెన్సి కేసు వైద్యం కోసం సోమవారం స్థానిక పీహెచ్‌సీకి వచ్చింది. ఈ సందర్భంగా డాక్టరు అందుబాటులో లేక పోవడంతో సిబ్బంది తెలిసిన వైద్యం చేసి అనంతరం 108 అంబులెన్స్‌లో ఉట్నూరు సివిల్ ఆసుపత్రికి తరలించారు. జైనూరులో డాక్టర్లు తరచుగా అందుబాటులో ఉండకపోవడంతో సాధారణ కేసులను సైతం వైద్య సిబ్బంది కావల్సిన వైద్యం చేసి ఇతర ప్రాంతాలకు తదుపరి వైద్యం కోసం పంపిస్తున్నారు. మండల కేంద్రంలో వైద్యం కోసం జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల నుంచి రోగులు వైద్యం కోసం నిత్యం వస్తున్నారు. స్థానికంగా వైద్యులు అందుబాటులో ఉండకపోవడంతో ప్రజలు వారి పనితీరుపై మండిపడుతున్నారు. అయితే డాక్టరు లేనందున ఘుమనూర్ నుంచి వచ్చిన ఎమర్జెన్సీ కేసు గత్యంతరంలేక ఇతర 108 అంబులెన్స్‌లో ఉట్నూర్ సివిల్ ఆసుపత్రికి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారులు స్పందించి డాక్టర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జెట్ ఇన్నోవేటివ్ అవార్డు అందుకున్న రాజేష్

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని జన్కాపూర్ పాఠశాల జీవశాస్త్రం ఉపాధ్యాయుడు వడ్లూరి రాజేష్ జెట్ ఇన్నోవేటివ్ అవార్డును జెట్ ప్రాజెక్టు డైరెక్టర్ అరుణ్‌కుమార్, వింగ్ కమాండర్ అవినాష్ అంటోనీ చేతుల మీదుగా సోమవారం అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, నాయకులు పలువురు రాజేష్‌ను అభినందించారు.

కొనసాగుతున్న దేవీ నవరాత్రోత్సవాలు


సిర్పూర్(యు)లో పూజలు చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్

సిర్పూర్(యు), సెప్టెంబంరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో దేవీ నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మండల కేంద్రంలో గల దుర్గాదేవి అమ్మవారిని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్‌రావు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికతను అందరు అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ ఆత్రం ఆనంద్‌రావు, హలే సురేష్, మెస్రం ప్రకాష్, సతీష్, నవీన్ జైశ్వల్ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: మండలంలోని గణేష్ నగర్, విహకర్‌సెక్షన్ కాలనీలో భక్తిశ్రద్ధలతో భక్తులు సోమవారం దుర్గామాతకు పూజలు నిర్వహించారు. ప్రతీరోజు ఉదయం సాయంత్రం పుణ్యస్నానాలు ఆచరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు దాండియా నృత్యం చేస్తూ ఆకట్టుకుంటున్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాతను పలువురు ప్రముఖులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకన్నారు. డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా చైర్మన్ అరిగెల నాగేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బాలేష్‌గౌడ్, వవిలాస్, అశ్విన్, సుగుణాకర్, శ్రీనివాస్‌గౌడ్, ఆనంద్, శ్రీనివాస్, చరణ్, బలరాం, అడ్వకేట్ దీపక్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: రెబ్బెన మండలం ఇందిరానగర్‌లోని కనక దుర్గాదేవి స్వయంభు మహంకాళి ఆలయంలో శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. 8వ రోజు సోమవారం సరస్వతి దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కుటుంబసభ్యులు అమ్మవారికి పట్టువస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు దేవర వినోద్ ఆధ్వర్యంలో పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. అనంతరం ఆలయ అధ్యక్షుడు మోడెం తిరుపతి, సభ్యులు అన్నదానం నిర్వహించారు.

ఏజెన్సీలో గిరిజనులకే రిజర్వేషన్లు కల్పించాలి

జైనూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకే పూర్తిస్థాయిలో రిజర్వేషన్లు కల్పించాలని ఆదివాసులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా సోమవారం జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల ఆదివాసులు స్థానిక మార్కెట్ కమిటీ యార్డులో సమావేశం నిర్వహించారు. గోండానా రాయి సెటర్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, తుడుం దెబ్బ, ఆదివాసీ, సంక్షేమ పరిషత్ తదితర సంఘాల నాయకులు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రకటించిన రిజర్వేషన్ల ప్రక్రియపై తీవ్ర వ్యతిరేకత కనబర్చారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ విధివిధానాలను ప్రభుత్వం పునఃపరిశీలించాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్ల ప్రక్రియలో గిరిజనులకు అన్యాయం జరిగిందని వారు వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గిరిజన ప్రాంతంలో పెసా చట్టం అనుగుణంగా గిరిజనులకే పూర్తి రిజర్వేషన్లు కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు మధురాజ్, ఆత్రం అర్జున్, నీలకంఠ్, గేడాం గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

ఆసిఫాబాద్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి అని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాకులు, వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖాధికారిగా పనిచేస్తున్న సజీవన్ పదవీవిరమణ పొందడంతో సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో ఏర్పాటు చేసిన పదవీ విరమణ కార్యక్రమంలో ఎస్పీ కాంతిలాల్ పాటిల్, అధికారులతో కలిసి హాజరై సజీవన్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సజీవన్ జిల్లా అధికారిగా అందించిన సేవలను కొనియాడారు. శేష జీవితం కుటుంబసభ్యులతో కలిసి సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

బస్టాండ్ నిర్మించండి..

తాండూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో బస్టాండ్ నిర్మించాలని కోరుతూ సీపీఐ మండల కార్యదర్శి కొం డు బానేష్ సోమవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఐ బీలో బస్టాండ్ లేకపోవడంతో కొన్నేళ్లుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారన్నారు. నిలువ నీడ లేక రోడ్డు పక్కన ఉన్న వ్యాపార సముదాయాలు, హోటళ్ల ముందు ఉండాల్సి వస్తుందన్నారు. మహిళలు, చిన్న పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే సులభ్ కాంప్లెక్స్ లేకపోవడంతో వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలన్నారు. నాయకులు బయ్య మొగిలి, నరాల ప్రహ్లాద్, నాగరాజు, శంకర్, గోపాల్, భీమేష్, సాయికుమార్, తిరుపతి, సన్యాసి, కళ, అంజయ్య, శంకర్, చంద్రయ్య, భీమయ్య, సత్తయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

బెల్లంపల్లి, సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి): వేమనపల్లి మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజా పాలన ప్రభుత్వంతోనే వివిధ పార్టీలకు చెందిన నా యకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా పని చేయాలని పార్టీలో చేరిన వారికి సూచించారు. వేమనపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ సాబీర్, మాజీ జడ్పీటీసీ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

గిరిజన సంప్రదాయాలను కాపాడేది ఆదివాసీలే

దండేపల్లి సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేది ఆదివాసి గిరిజనులేనని రాష్ట్ర గిరిజన కో-ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. మండలంలోని పద్మల్‌పూరీ కాకో ఆలయంలో దండారి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయం వద్ద ఎత్మైమాల్ పేన్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్‌కు డిమేత సోముపటేల్, వైస్ ఛైర్మన్ కోమురం లింగారావు, ఆదివాసి సేన జిల్లా అధ్యక్షుడు పెంద్రం శ్రీనివాస్, న్యాయవాది పెంద్రం గోపి, నాయకులు జంగు, లచ్చుపటేల్, సంతోష్, రాజు, బాధిరావు పాల్గొన్నారు.

సరస్వతి అమ్మవారి రూపంలో దుర్గామాత

లక్షెట్టిపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోదావరి రోడ్డులో శరన్నవరాత్రుల్లో భాగంగా నెలకొల్పిన దుర్గామాత అమ్మవారి మండపాల్లో సోమవారం దుర్గామాత శ్రీసరస్వతి అమ్మవారి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చింది. వేద పండితులు అమ్మవారికి ప్రత్యే పూజలు నిర్వహించి చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. అంతకు ముందు రోజు రాత్రి ప్రదోశకాళ మహాలింగార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేద పండితులు ముద్ద ప్రణవ్‌శర్మ, వినోద్ శర్మ, విశ్వాస్‌లు అభిశేకం నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేసారు. భక్తులకు మండప కమిటీ సభ్యులు అల్పాహారం ఏర్పాటు చేయడంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించారు.

పట్టుబడుతూ.. కొలువులు కొడుతూ

ఆరో ఉద్యోగం సాధించిన లింగాపూర్ యువకుడు

దండేపల్లి సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లిం గాపూర్ గ్రామానికి చెందిన బాన వత్ సంతోష్ ఇప్పటికే ఐదు ఉద్యో గులు సాధించి, మళ్లీ గ్రూప్-2లో మరో ఉద్యోగం సాధించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. గ్రూప్-2 ఫలితాల్లో సంతోష్ లా డిపార్ట్‌మెం ట్‌లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఎస్ వో) ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం మంచిర్యాలలో కమర్షియల్ టాక్స్ విభాగంలో జూనియర్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నాడు. లింగాపూర్ చెందిన బానవత్ భగ్గు విజయ దంపతుల కుమారుడు సంతోష్‌ల క్షెట్టిపేటలో ఇంటర్ వరకు, హైదరాబాద్ ఉస్మాని యాలో ఎల్ఎల్ బీ, ఎల్ ఎల్ఎమ్ పూర్తి చేశాడు. సంతోష్ తండ్రి భగ్గు 2009లో అనారోగ్యంతో మృతి చెందాడు. తల్లి విజయ, ముగ్గురు అక్కలు కష్టపడి తనను చది వించడంతోనే సంతోష్ ఇప్పటికే కానిస్టేబుల్, పంచాయతీ కార్యదర్శి, జైలు వార్డర్, ఫారెస్టు బీట్ ఆఫీసర్, కమర్షియల్ టాక్స్ విభాగంలో జూనియర్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగాలు సాధించాడు. మళ్లీ గ్రూప్-2 పరీక్ష రాసి, ఆరో ఉద్యోగం సాధించి ప్రతిభ చాటు కున్నాడు. ఈసందర్భంగా యువకుడు సంతోష్‌ను మండల ప్రజాప్రతిని ధులు, ప్రజలు. కుటుంబసభ్యులు, బంధు వులు గ్రామస్థులు, అధికారులు అభినందించారు.


తల్లి విజయతో సంతోష్

గ్రూప్-2లో ఉద్యోగం సాధించిన యువకుడు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్ 2 ఫలితాల్లో పట్టణంలోని ప్రాణహిత కాలనీకి చెందిన బొడ్డు తిరుపతి 77వ ర్యాంకు సాధించాడు. తెలంగాణ సెక్రటేరియల్‌లో ఎఎస్‌వో (జేప డీ)గా ఉద్యోగం వచ్చింది. గతంలో మందమర్రిలోని కేకే 5 గనిలో మైనింగ్ సర్దార్‌గా ఉద్యోగం చేశాడు. గ్రూప్ 4 పరీక్ష రాయగా అందులో కూడా ఉద్యోగం సాధించగా ప్రస్తుతం క్యాతనపల్లి మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గ్రూప్ 2 ఫలితాల్లో మంచి ర్యాంకు సాధించి ఉద్యోగం రావడం పట్ల తిరుపతిని మిత్రులు అభినందించారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

పాల్గొన్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

మంచిర్యాల క్రైం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల పట్టణంలోని స్థానిక విశ్వనాథ ఆలయంలో సద్దుల బతుకమ్మ వేడుకలను సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మంచిర్యాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు సతీమణి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ కుటుంబ సభ్యులతో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. పలు వార్డుల్లో జరిగిన బతుకమ్మ కార్యక్రమాల్లో సురేఖ పాల్గొని స్థానిక మహిళలతో సంబరాల్లో మమేకమయ్యారు. బతుకమ్మ పూలతో, పాటలతో సాంప్రదాయ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.


లక్షెట్టిపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు..


మందమర్రిమూడవ జోన్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


శ్రీరాంపూర్‌లో సివిల్ విభాగం వారి బతుకమ్మతో..

పూల పండుగ..

వైభవంగా సద్దుల బతుకమ్మ

మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ సంబరాలు సోమవారం ఘనంగా జరిగాయి. మహిళలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని బతుకమ్మ ఆడారు. వాడవాడనా బతుకమ్మ పాటలు మారుమోగాయి. తీరొక్క పూలతో చేసిన బతుకమ్మలను ఆయా కూడళ్ల వద్ద ఉంచి బతుకమ్మ ఆడి రాత్రి వేళలో నిమజ్జనం చేశారు. అనంతరం వాయినాలు ఇచ్చుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

\- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


లక్షెట్టిపేట..


చెన్నూర్‌లో బతుకమ్మ సంబరాల్లో మహిళలు


మందమర్రిలో బతుకమ్మతో యువతి..


దండేపల్లిలో సద్దుల బతుకమ్మ ఆడుతున్న మహిళలు


నస్పూర్‌లో..


మందమర్రి మండలంలో..

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌కు

రాష్ట్రస్థాయి అవార్డు

కాసిపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బోధనతో పాటు విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి వారిని కొత్త ఆవిష్కరణల దిశగా ప్రోత్సహిస్తూ అనేక జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిపిన కాసిపేట తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ అబ్దుల్ ఖలీల్‌ను రాష్ట్రస్థాయి ఇన్నోవేటివ్ అవార్డు వరించింది. ఆదివారం హైద్రాబాద్‌ని హరిహర కళాభవన్‌లో జరిగిన జటాధర ఎడ్యుకేషన్ టెక్నాలజీస్ వారు నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఖలీల్‌ను అవార్డుతోపాటు నగదు ప్రోత్సాహక బహుమతిని అందించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డు వింగ్ కమాండర్ అనీష్ ఆంటోని అతిథిగా హాజరై మాట్లాడారు. శాస్త్రసాం కేతిక రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తూ గ్రామీణ విద్యార్థుల నుంచి ఆవిష్కరణలు రావాలన్నారు. అబ్దుల్ ఖలీల్‌ను కళాశాల సిబ్బంది, ఉపాధ్యాయులు పలువురు అభినందించారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

దండేపల్లి సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వందూర్‌గూడ గ్రామ పంచాయతీ ఏర్పాటు విషయంలో తప్పుడు సమాచారం అందించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం దండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో వందూర్‌గూడ గిరిజనులు ఎంపీడీవో ప్రసాద్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో వందూర్‌గూడ గిరిజనులు కోవ ధర్మారావు, కోవ మా రుతీ, కుడ్మెత వినోద్ కుంరం బాపురావు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట రేషన్ డీలర్ల నిరసన

నస్పూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రేషన్ డీలర్లకు ఆరు నెలల కమిషన్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట మంచిర్యాల జిల్లా చౌకధరల దుకాణాల డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్య క్తం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కుమార్ దీపక్‌కు అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడు తూ పంపిణీ చేసిన ఉచిత బియ్యానికి సంబంధించిన కమీషన్ ఆరు నెలలు గడుస్తున్నా ఇవ్వలేదన్నారు. కమీషన్ రాకపోవడంతో కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నాయన్నారు.

ప్రభుత్వం హామీ ఇచ్చిన గౌరవ వేతనం రూ. 5వేలు, రూ. 300 కమీషన్ ఇప్పించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సత్తయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ సుదమల్ల కృష్ణ, నాయకులు మహేందర్, రవి పాల్గొన్నారు.



నల్లబ్యాడ్జీల ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న రేషన్ డీలర్లు

నాగార్జున కాలనీలో రామ్‌లీల మహోత్సవం

నస్పూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అక్టోబరు 2న రామ్ లీల మహోత్సవాన్ని నస్పూర్‌లోని నాగార్జున కాలనీ ప్రాణహిత మైదానంలో నిర్వహిస్తున్నట్లు హిందూ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు చుంచు రాజ్ కిరణ్ తెలిపారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాణహిత మైదానంలో సాయంత్రం 4 గంటలకు ఈ మహోత్సవం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో హిందూ ఉత్సవ సమితి నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపిక

కాసిపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు పత్తిపాక మణిదీప్ ఎంపికైనట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి బాబురావు సోమవారం తెలిపారు. మణిదీప్ మందమర్రి మోడల్ కాలేజీలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతన్నాడు. ఈ నెల 25,26,27 తేదీల్లో జనగామలో జరిగిన 69వ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొని మెరుగైన ప్రతిభ కనబర్చారు. దీంతో మణిదీప్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. అక్టోబరు 2 నుంచి 12 వరకు టీనగర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో మణిదీప్ పాల్గొంటాడని తెలిపారు. విద్యార్థిని డీఐఈవో అంజయ్య, ఒలంపిక్ అసోసియేషన్ ఫుట్‌బాల్ సెక్రటరీ పిన్నింటి రఘునాధ్‌రెడ్డి, కోచ్ సురేందర్‌లు అభినందించారు.

మహిళలకు చీరలు పంపిణీ

కోటపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లంపేట గ్రామంలో సోమవారం టీడీపీ ఆధ్వర్యంలో మహిళలకు పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి సంజయ్‌కుమార్ చీరలను పంపిణీ చేశారు. పేదింటి ఆడపడుచులు సంతోషంగా పండగ నిర్వహించుకు నేందుకు చీరలు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళ అధ్యక్షురాలు జయ సుకన్య, నాయకులు సంధ్య, కవిత పాల్గొన్నారు.

మోగిన నగారా..

(5వ పేజీ తరువాయి)

కానుండగా, అదే రోజు నామినేషన్లు స్వీకరణ ప్రారంభం, ఓటర్ల జాబితా ప్రదర్శన, 19న నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ, 20న నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటైన అభ్యర్థుల జాబితా విడుదల, 21న అప్పీళ్లకు గడువు, 22న అప్పీళ్ల పరిష్కరణ, 23న నామినేషన్ల ఉపసంహరణ గడువు, అభ్యర్థుల తుది జాబితా విడుదల, 31నఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపు చేపడతారు.

రెండో విడత..

అక్టోబర్ 21వ తేదీన రెండో విడుత ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుండగా, అదే రోజు నామినేషన్లు స్వీకరణ ప్రారంభం, ఓటర్ల జాబితా ప్రదర్శన, 23న నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ, 24న నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటైన నామి నేషన్ల జాబితా విడుదల, 25న అప్పీళ్లకు గడువు, 26న అప్పీళ్ల పరిష్కరణ, 27న నామినేషన్ల ఉపసంహరణ గడువు, అభ్యర్థుల తుది జాబితా విడుదల, నవంబరు 4వ తేదీన ఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

మూడో విడత..

అక్టోబర్ 25వ తేదీన మూడో విడుత ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుండగా, అదే రోజు నామినేషన్లు స్వీకరణ ప్రా రంభం, ఓటర్ల జాబితా ప్రదర్శన, 27న నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ, 28న నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటైన నామినేషన్ల జాబితా విడుదల, 29న అప్పీళ్లకు గడువు, 30న అప్పీళ్ల పరిష్కరణ, 31న నామినేషన్ల ఉపసంహరణ గడువు, అభ్యర్థుల తుది జాబితా విడుదల, నవంబరు 8వ తేదీన ఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపు చేపట్టి విజేతలను ప్రకటించనున్నారు.

గోదావరి ఉధృతి.. పొలాల్లోకి చేరిన నీరు


నస్పూర్‌లో పొలాల వద్ద చేరిన గోదావరి వరద నీరు


చెన్నూర్‌లో నీటిలో మునిగిన పంటలు

నస్పూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గోదావరి నదిలోకి ఎగువ నుంచి వరద నీటి ప్రవాహంతో నస్పూర్ సమీపంలో గల పొలాల్లోకి వరద నీరు చేరింది. కొన్ని చోట్ల వరి పంట పొట్టదశకు చేరడం వలన అధికంగా నీరు నిలిచి పంట దిగుబడి పడిపోయే పరిస్థితి ఉన్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

చెన్నూరు : ఎగువన కురిసిన వర్షాలకు ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు తెరవడంతో మండంలోని సుందరసాల గ్రామ సమీపంలోని అన్నారం బ్యారేజీ బ్యాక్ వాటర్‌తో పత్తి పంట పొలాలు నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇలా పంటలు మునగడం ఇది రెండవ సారి అని పేర్కొంటున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని రైతులు కోరారు.

నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు

- రూ. 500 కోట్లతో పనులు
- విద్య, వైద్యానికి పెద్దపీట
- సింగరేణిలో నూతన గనుల ఏర్పాటు అవసరం
- రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి


మాట్లాడుతున్న మంత్రి వివేక్(ఫైల్)

మందమర్రిటౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి వాటిని అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నానని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి తెలిపారు. రాజకీయాల్లో తన తండ్రిని స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నానని అన్నారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో కోలుకోలేని విధంగా దెబ్బతిందని, ఖజానా ఖాళీ అయ్యిందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కుంభకోణాలపై, కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిని ప్రజల్లోకి తీసుకువెళ్లింది తానేనని తెలిపారు. తనను ఎన్నో సార్లు ఇబ్బందులు పెట్టారని, అయినా సరే భయపడకుండా బీఆర్ఎస్‌ను గద్దె దించే వరకు పోరాటాలు చేశానని తెలిపారు. ప్రజల ఆశీస్సులతో ప్రభుత్వం ఏర్పడి తనకు మంత్రి పదవి వచ్చిన తర్వాత నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నానన్నారు. విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తున్నానన్నారు. నియోజకవర్గంలో రూ. 500 కోట్లతో పనులు చేపట్టామని, ఇవి పూర్తి కావస్తున్నాయన్నారు. కోటపల్లిలోని సోమనపల్లిలో ఇంటిగ్రే టెడ్ పాఠశాల పనులు ప్రారంభమయ్యాయన్నారు. గత పాలనకు, కాంగ్రెస్ పాలనకు చాలా తేడా ఉందని, ప్రజలు చర్చించుకుంటున్నారు. రేషన్ సన్నబియ్యం, ఉచిత బస్సు తదితర పథకాలతో ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరిగిందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రవేశ పెట్టిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని, దీని అమలు కోసం కృషి చేస్తున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రజలకు అందుబాటులో ఉండాల న్నదే తన ఆకాంక్ష అన్నారు. రానున్న రోజుల్లో చాలా గనులు మూతపడుతున్నాయనే నివేదిక ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని నూతన గనుల కోసం ఒక నివేదికను రూపొందించానన్నారు. చెన్నూరులో మూత పడిన గనులను తెరిపించేందుకు సాధ్యా సాధ్యాలను సీఎంకు వివ రించానని తెలిపారు. ముఖ్యమంత్రి సమ క్షంలో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి సింగరేణికి పూర్వ వైభవం తీసుకు రావ డానికి దృష్టి పెట్టినట్లు తెలిపారు. కొత్త గనులు వస్తేనే ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంటర్ సెంటర్‌లను ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చి 80 శాతం స్థానికులకే ఉద్యో గాలు ఇవ్వాలని సింగరేణికి చెప్పామన్నారు. జైపూర్‌లోని ఎస్టీపీపీ విస్తరణతో చాలా ఉద్యోగాలు యువతకు లభిస్తాయన్నారు. అవినీతి రహిత పాలన కోసం తాను, తన కుటుంబం ముందుంటుందన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉంటానని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలే తమ అభ్యర్థులను గెలిపిస్తాయన్నారు. ప్రమాదాలు లేని పరిశ్రమలను చేయడమే లక్ష్యమని తెలిపారు. రాష్ట్రంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ప్రభుత్వం ప్రారంభించిందని, ఇవి విద్యార్థుల ఉపాధి అవకాశాలకు దోహదం చేస్తాయన్నారు. విశాక చారిటబుల్ ట్రస్టు ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మంత్రిగా కంటే ప్రజల్లో ఒకడిగా, ప్రతి ఇంటిలో కుటుంబ సభ్యుడిగా ఉండడం తనకు ఇష్ట మని తెలిపారు.


ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తున్న మంత్రి వివేక్(ఫైల్)



ఆంధ్రజ్యోతి

5

మంచిర్యాల

జిల్లా వార్తలు

మంగళవారం 30 సెప్టెంబరు 2025







మోగిన నగారా..

- స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల
- మొత్తం ఐదు విడుతల్లో నిర్వహణ
- రెండు విడతల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు
- ఆ తరువాత మూడు విడతల్లో పంచాయతీ ఎలక్షన్లు
- అక్టోబర్ 9న నోటిఫికేషన్ విడుదల
- అదే రోజు నుంచి నామినేషన్లు ప్రారంభం
- తక్షణమే అమల్లోకి ఎన్నికల కోడ్

మంచిర్యాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఎట్టకేలకు మార్గం సుగమం అయింది. స్థానిక సంస్థల ఎన్నికలను మొత్తం ఐదు విడుతల్లో నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. రెండు విడుతల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరుగనుండగా, పంచాయతీ ఎన్నికలను మూడు విడతలుగా నిర్వహించనున్నారు. వాస్తవానికి లోక్‌సభ ఎలక్షన్లు ముగియగానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, పాలనపై పట్టు సాధించేందుకు కొంత సమయం పట్టింది. దీంతో స్థానికసంస్థల ఎన్నికల నిర్వహణలో సంవత్సరం పాటు జాప్యం జరిగింది. గ్రామ పంచాయతీల పాలన గత సంవత్సరం జనవరిలో ముగియగా, జిల్లా పరిషత్, మండల పరిషత్‌ల పాలక వర్గాల పదవీకాలం జూలై మాసంతో ముగిసింది. ఏడాది సుదీర్ఘ సమయం దాటిన తరువాత ఎట్టకేలకు మార్గం సుగమం

కావడంతో పల్లెల్లో ఎన్నికల సందడి నెలకొంది. కాగా జిల్లాలో మొత్తం 16మండలాలు ఉండగా.. జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు కూడా అంతే మొత్తంలో ఉన్నాయి. అలాగే ఎంపీటీసీ స్థానాలు 129 ఉన్నాయి. మొత్తం ఎంపీ టీసీ స్థానాలకుగాను బీసీలకు 54, ఎస్సీలకు 33, ఎస్టీలకు 14, జనరల్‌కు 28 కేటాయించారు. అలాగే 306 సర్పంచ్ స్థానాల్లో బీసీలకు 109, ఎస్సీలకు 81, ఎస్టీలకు 65, జనరల్‌కు 51స్థానాలను కేటాయించారు. ఎలక్షన్ షెడ్యూల్ విడుదల కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ కూడా అమల్లోకి వచ్చింది.

మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు...

మొదటి విడత..

మండల, జిల్లా పరిషత్ ఎన్నికల నోటిఫికేషన్ మొదటి విడుత అక్టోబర్ 9వ తేదీన విడుదల కానుండగా, అదే రోజు నామినేషన్లు స్వీకరణ ప్రారంభం, ఓటర్ల జాబితా ప్రదర్శన, 11న నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ, 12న నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటైన అభ్యర్థుల జాబితా విడుదల, 13న అప్పీళ్లకు గడువు, 14న అప్పీళ్ల పరిష్కరణ, 15న నామినేషన్ల ఉపసంహరణ గడువు, అభ్యర్థుల తుది జాబితా విడుదల, 23న ఎన్నికల నిర్వహణ, నవంబరు 11న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

రెండో విడత..

అక్టోబర్ 13వ తేదీన మండల, జిల్లా పరిషత్ ఎన్నికల నోటిఫికేషన్ రెండో విడుత విడుదల కానుండగా, అదే రోజు నామినేషన్లు స్వీకరణ ప్రారంభం, ఓటర్ల జాబితా ప్రదర్శన, 15న నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ, 16న నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటైన అభ్యర్థుల జాబితా విడుదల, 17న అప్పీళ్లకు గడువు, 18న అప్పీళ్ల పరిష్కరణ, 19న నామినేషన్ల ఉపసంహరణ గడువు, అభ్యర్థుల తుది జాబితా విడుదల, 27న ఎన్నికల నిర్వహణ, నవంబరు 11న ఓట్ల లెక్కింపు

గ్రామ పంచాయతీ ఎన్నికలు...

మొదటి విడత...

అక్టోబర్ 17వ తేదీన మండల, జిల్లా పరిషత్ ఎన్నికల నోటిఫికేషన్ మొదటి విడుత విడుదల..

-మిగతా 7లో

జడ్పీటీసీ, ఎంపీపీ రిజర్వేషన్లు ఇలా...

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మొదట జడ్పీటీసీ, ఎంపీపీ ఎలక్షన్లు నిర్వహించనున్నారు. ఇందుకుగాను ఇటీవల మండలాల వారీగా అభ్యర్థులకు కేటాయించిన రిజర్వేషన్లను అధికారులు ఖరారు చేశారు.

స్థానం	జడ్పీటీసీ	ఎంపీపీ
జన్నారం	ఎస్టీ(జనరల్)	బీసీ(మహిళ)
మందమర్రి	ఎస్టీ(మహిళ)	ఎస్టీ(మహిళ)
బెల్లంపల్లి	ఎస్సీ(మహిళ)	ఎస్సీ(మహిళ)
భీమారం	ఎస్సీ(జనరల్)	ఎస్టీ(జనరల్)
హాజీపూర్	ఎస్సీ(మహిళ)	ఎస్సీ(జనరల్)
నెన్నెల	ఎస్సీ(జనరల్)	ఎస్సీ(జనరల్)
చెన్నూరు	బీసీ(మహిళ)	బీసీ(మహిళ)
దండేపల్లి	బీసీ(జనరల్)	జనరల్(మహిళ)
జైపూర్	బీసీ(జనరల్)	బీసీ(జనరల్)
కన్నెపల్లి	బీసీ(మహిళ)	ఎస్సీ(మహిళ)
కాసిపేట	బీసీ(జనరల్)	బీసీ(మహిళ)
తాండూరు	బీసీ(మహిళ)	జనరల్
వేమనపల్లి	బీసీ(జనరల్)	బీసీ(జనరల్)
భీమిని	జనరల్	జనరల్
కోటపల్లి	జనరల్	బీసీ(జనరల్)
లక్షెట్టిపేట	జనరల్(మహిళ)	బీసీ(జనరల్)

జిల్లాలో 3.7 లక్షల ఓటర్లు...

పంచాయతీ, పరిషత్ ఎన్నికల్లో తుది ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలోని 306 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 3,76,669 ఓటర్లు ఉన్నారు. వీరిలో స్త్రీలు 1,91,011 మంది ఉండగా, పురుషులు 1,85,643, ఇతరులు 15 మంది ఉన్నారు.

మండలాల వారీగా ఓటర్ల వివరాలు...

మండలం	మొత్తం	పురుషులు	స్త్రీలు	ఇతరులు
బెల్లంపల్లి	23464	11625	11838	01
భీమిని	11529	5844	5684	01
భీమారం	13093	6394	6699	00
చెన్నూర్	26475	13040	13435	00
దండేపల్లి	42101	20486	21614	01
హాజీపూర్	16954	8361	8593	00
జైపూర్	30626	15278	15347	01
జన్నారం	44412	21670	22740	02
కన్నెపల్లి	15490	7614	7875	01
కాసిపేట	26472	13127	13342	03
కోటపల్లి	26990	13320	13668	02
లక్షెట్టిపేట	25227	12261	12966	00
మందమర్రి	11482	5678	5803	01
నెన్నెల	19371	9636	9734	01
తాండూర్	27757	13741	14016	00
వేమనపల్లి	15226	7568	7657	01



సమాచారం లేకుండానే యూరియా అమ్మకం

చెన్నూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాగెపల్లిలోని ఓ డీలరు దుకాణానికి ఆదివారం 222 యూరియా బస్తాలు వచ్చాయి. వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వకుండానే 120 బస్తాలను అదే రోజు రాత్రి విక్రయించినట్లు సమాచారం. ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని వ్యవసాయాధికారి యామిని తెలిపారు. మిగిలిన 100 బస్తాలను సోమవారం రైతులకు పంపిణీ చేయించామని, అధికారులకు సమాచారం ఇవ్వకుండా యూరియా విక్రయించినందుకు డీలర్‌కు మెమో ఇచ్చినట్లు ఆమె తెలిపారు.

వేమనపల్లిలో..

వేమనపల్లి: యూరియా బస్తాల అక్రమ తరలింపుపై విచారణ చేపట్టాలని కోరుతూ సోమవారం నీల్వాయిలోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో మండల వ్యవసాయాధికారికి బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ ఫిర్యాదు అందించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు పంపిణీ చేయడానికి ఆదివారం నీల్వాయిలోని సహకార సంఘానికి యూరియా బస్తాలతో లారీ రాగా లారీని మార్గమధ్యంలో ఆపి ట్రాక్టర్‌లోకి అక్ర మంగా యూరియా బస్తాలను తరలించారన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే యూరియా అక్రమార్కుల చేతుల్లోకి వెళ్తుందన్నారు. దీనిపై పూర్తి విచారణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చరణ్ రాజ్, లస్మయ్య పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి


మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మంచిర్యాల, కాసిపేట, బెల్లంపల్లి, నస్పూర్, తదితర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు స్వీకరించారు.





వైభవంగా సద్దుల బతుకమ్మ సంబరాలు







మంచిర్యాలలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



టీఎన్‌జీవోస్ కాలనీలో బతుకమ్మను తీసుకువస్తున్న కుటుంబీకులు



లక్షెట్టిపేటలో..

మంచిర్యాలకలెక్టరేట్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): సద్దుల బతుకమ్మ సంబరాలు జిల్లాలో సోమవారం అంబరాన్నంటాయి. మహి ళలు తంగేడు, గునుగు, బంతిపూలతో బతుకమ్మలను తయారుచేసి గౌరమ్మను పూజిం చారు. ఒక్కేసి పువ్వేసి చందమామ ఒక్క జాములాయే చందమామ.. రామ రామ రామ ఉయ్యాలో రామనే శ్రీరామ ఉయ్యాలో అంటూ మహిళలు సద్దుల బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. మహిళలు ఉదయం తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చారు. పసుపుతో గౌరమ్మను చేసి బతుక మ్మల్లో పెట్టి పూజలుచేసి నైవేద్యాలను సమర్పించారు. రాత్రి ప్రధాన కూడళ్ల వద్ద బతుకమ్మలు పెట్టి పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. చిన్నారులు, యువతులు, మహిళలు నృత్యాలు చేస్తూ సంబరాలను నిర్వహించారు. మహిళ లందరు భక్తిశ్రద్ధలతో బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. అనంతరం ఒకరికి ఒకరు వాయినాలు ఇచ్చుకున్నారు. రాళ్లవాగు, గోదావరినది, రాముని చెరవులో బతుకమ్మలను నిమజ్జనంచేశాయి.







మందమర్రిలో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు

